## ఏసీబీ వలలో పరిశ్రమల శాఖ జీఎం

- వాహన సబ్సిడీ మంజూరుకు లంచం డిమాండ్
- ఏసీబీని ఆశ్రయించిన బాధితుడు లచ్చిరాం
- రూ.15వేలు తీసుకుంటూ పట్టుబడిన శ్రీనివాస్


ఏసీబీ అధికారులు పట్టుకున్న రూ.15వేలు

జయశంకర్ భూపాలపల్లి, అక్టోబర్ 19(నమస్తే తెలంగాణ) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ గంగాధర శ్రీనివాస్ గురువారం ఏసీబీకి చిక్కాడు. ఆయన ములుగు జిల్లాకు ఇన్‌చార్జిగా కూడా వ్యవహరిస్తున్నాడు. కాగా, భూపాలపల్లిలోని జిల్లా పరిశ్రమల శాఖ కార్యాలయంలో శ్రీనివాస్ రూ.15వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు. ఏసీబీ డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు జిల్లా మల్లంపల్లి శ్రీనగర్‌కు చెందిన గుగులోత్ లచ్చిరాం ఏడాది క్రితం పరిశ్రమల శాఖ ద్వారా రూ.53లక్షలతో అశోక్ లేల్యాండ్ వాహనం తీసుకున్నాడు. సబ్సిడీ కోసం పరిశ్రమల శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలో పరిశ్రమల శాఖ డీఎం మొదట రూ.50వేలు డిమాండ్ చేయగా, లచ్చిరాం ఇచ్చాడు. మళ్లీ మరో రూ.60వేలు కావాలంటూ డిమాండ్ చేయగా, విసుగు చెందిన లచ్చిరాం వరంగల్‌లోని ఏసీబీ కార్యాలయాన్ని ఆశ్రయించాడు. లచ్చిరాం రూ.15వేలు పరిశ్రమల శాఖ జీఎం శ్రీనివాస్‌కు ముట్టజెప్పుతుండగా ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ మాట్లాడుతూ.. పరిశ్రమల శాఖ జీఎం లచ్చిరాం వద్ద రూ.15వేలు తీసుకుంటుండగా పట్టుకున్నామని, శ్రీనివాస్‌ను హైదరాబాద్‌లోని ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరు లంచం అడిగినా 9154388912 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

## రాహుల్‌గాంధీ పర్యటనలో అపశృతి

### స్కూటీ నడుపుతూ కిందపడ్డ కొండా సురేఖ.. స్వల్ప గాయాలు

జయశంకర్ భూపాలపల్లి, అక్టోబర్ 19(నమస్తే తెలంగాణ) : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో జరిగిన రాహుల్‌గాంధీ పర్యటనలో అపశృతి నెలకొంది. బైక్ ర్యాలీలో పాల్గొన్న మాజీ మంత్రి కొండా సురేఖ స్కూటీ నడుపుతూ అదుపు తప్పి కిందపడింది. దీంతో ఆమెకు స్వల్ప గాయాలయ్యాయి. జిల్లా కేంద్రంలో గురువారం ఉదయం జెన్‌కో అతిథి గృహం నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీ తీశారు. సురేఖ స్కూటీ నడుపుతూ కార్యకర్తలతో పాటు వచ్చింది. ఈ క్రమంలో భూపాలపల్లి శివారులో అదుపుతప్పి కిందపడిపోయింది. ప్రమాదంలో సురేఖకు స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స కోసం హనుమకొండకు తరలించారు.

## రైలు నుంచి జారిపడి ఒకరి మృతి

డోర్నకల్, అక్టోబర్ 19 : ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి చెందాడు. జీఆర్పీ ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాలు ప్రకారం.. డోర్నకల్ –గుండ్రాతి మడుగు రైల్వే స్టేషన్ల మధ్య రైలు నుంచి గుర్తు తెలియని వ్యక్తి జారి పడి మృతి చెందాడు. ఖమ్మం ఏరియా దవాఖానలో మృతదేహాన్ని భద్రపరిచామని, వివరాలు తెలిస్తే 8712658600 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

# కాంగ్రెస్ షో అట్టర్ ఫ్లాప్

- రాహుల్, ప్రియాంక గాంధీల ములుగు పర్యటనకు ఆదరణ కరువు
- కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఆరు హామీలు ఎందుకు అమలు చేయడం లేదు
- మేడారం జాతరకు జాతీయ హోదా ఇప్పుడు గుర్తుకొచ్చిందా?
- ములుగులో గులాబీ జెండా ఎగురవేస్తాం
- సమావేశంలో మంత్రి సత్యవతిరాథోడ్
- రాజకీయ లబ్ధి కోసమే రాహుల్ పర్యటన
- ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి
- హాజరైన చీఫ్ విప్ దాస్యం, ఎంపీలు పసునూరి, కవిత


రామప్ప ఆలయానికి యునెస్కో గుర్తింపు తీసుకొచ్చేందుకు పలువురిని కలిసి విజ్ఞప్తి చేసిన ఫొటోలు చూపిస్తున్న మంత్రి సత్యవతిరాథోడ్, చీఫ్ విప్ దాస్యం, ఎమ్మెల్సీ పోచంపల్లి, ఎంపీలు దయాకర్, కవిత

హనుమకొండ, అక్టోబర్ 19 : కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీల ములుగు జిల్లా పర్యటన ఫ్లాప్ షోగా మారిందని స్త్రీ, శిశు, గిరిజన సంక్షేమ శాఖల మంత్రి సత్యవతిరాథోడ్ ఎద్దేవా చేశారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీలు బీఆర్ఎస్, సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌పై చేసిన వ్యాఖ్యలను పూర్తి ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో చేర్చిన ఆరు హామీలు హాస్యాస్పదంగా ఉన్నాయని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధినేతలు మత ప్రాంతానికి వస్తున్నారని, గొప్ప హామీలు ఇస్తారని ఎదురు చూసిన ప్రజలకు నిరాశే ఎదురయ్యిందన్నారు. ప్రాంతంపై అవగాహన లేని రాహుల్‌గాంధీ స్థానిక నాయకులు రాసిచ్చిన స్క్రిప్టును చదివారని, కొండను తవ్వి ఎలుకను పట్టినట్లుగా కాంగ్రెస్ పార్టీ వ్యవహారం ఉందని పేర్కొన్నారు. తెలంగాణపై ఆ పార్టీకి ఎలాంటి దూరదృష్టి లేదన్నారు. అరవై ఏళ్లు పాలించినా ఎప్పుడూ గుర్తుకురాని రామప్ప దేవాలయం, మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర ఎన్నికలు ముందు గుర్తుకు రావడాన్ని ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. పోడు చట్టం తామే తెచ్చామని అంటున్న కాంగ్రెస్ నాయకులు, అప్పటి చట్టంతో గిరిజన, గిరిజనేతరులకు అన్యాయం జరిగిందని తెలిపారు. కాంగ్రెస్ హయాలో 3 లక్షల ఎకరాలకు పోడు పట్టాలు ఇస్తే, సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో 4.60 లక్షల ఎకరాలకు పట్టాలు ఇచ్చామని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో ములుగు, భూపాలపల్లిలు కుగ్రామాలుగా ఉండేవని, ప్రత్యేక రాష్ట్రంలో ఎంతో అభివృద్ధి సాధించాయన్నారు. జిల్లాల ఏర్పాటుతో ప్రజలకు పాలన చేరువైందన్నారు. విభజన చట్టంలోని హామీలపై రాహుల్ గాంధీ ఎప్పుడైనా పార్లమెంట్‌లో మాట్లాడారా? అని ఆమె ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు ఏది చెబితే అది నమ్మే పరిస్థితుల్లో గిరిజనులు లేరన్నారు. గిరిజనుల రిజర్వేషన్‌పై ఆ పార్టీ మోసపూరిత హామీలు ఇస్తున్నదని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ములుగు ఎమ్మెల్యే సీతక్క ఐదు సంవత్సరాలుగా చేసింది ఏమీ లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిన ఆరు హామీలు ఆ పార్టీ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు అమలు చేయడం లేదో తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆ రాష్ట్రాల్లో ఆడపిల్లల పెళ్లిళ్లకు ఒక్క రూపాయి అయినా ఇచ్చారా? అని ప్రశ్నించారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో కల్యాణలక్ష్మి పథకం కింద రెండు లక్షలు ఇవ్వనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కనీసం ఆరు నెలలైనా ఒకే వ్యక్తి ముఖ్యమంత్రిగా ఉంటారా అనేది స్పష్టం చేయాలన్నారు. గిరిజనులు, పేదల గురించి మాట్లాడే హక్కు కాంగ్రెస్ అధినాయకత్వానికి లేదన్నారు. ఢిల్లీ బానిసలను ఇక్కడి ప్రజలు విశ్వసించరని అన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 108 సీట్లు వస్తాయని, ములుగు, భూపాలపల్లి నియోజక వర్గాల్లో గులాబీ జెండా ఎగురవేయడంతో పాటు సీఎంగా కేసీఆర్ హాట్రిక్ కొట్టడం ఖాయమని మంత్రి స్పష్టం చేశారు.

### రాహుల్, ప్రియాంకలు టూరిస్టులే..

**- ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి**

రామప్ప దేవాలయానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ రాజకీయ టూరిస్టులుగా మాత్రమే వచ్చిపోయారని ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పాలనలో రామప్ప టెంపుల్ గురించి పట్టించుకోకుండా ఇప్పుడు ఓట్ల కోసం దొంగల్లా వచ్చి వెళ్లారన్నారు. మేడారం జాతరను జాతీయ పండుగగా గుర్తించాలని పలుమార్లు కేసీఆర్ కోరినప్పటికీ పట్టించుకోని కాంగ్రెస్ ఇప్పుడు రాజకీయ లబ్ధి కోసం, అధికార దాహంతో జాతీయ పండుగగా గుర్తిస్తామని అనడం సిగ్గుచేటన్నారు. రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి పార్లమెంట్‌లో రామప్పకు యునెస్కో గుర్తింపు, విభజన చట్టంలోని హామీల గురించి ఒక్క రోజైనా అడిగారా? అని ప్రశించారు. సీఎం కేసీఆర్ కృషితోనే రామప్ప దేవాలయానికి యునెస్కో గుర్తింపు వచ్చిందన్నారు. ప్రశ్నించే గొంతుకలను అసెంబ్లీకి రాకుండా అడ్డుకుంటున్నారని ఎమ్మెల్యే సీతక్క అనడం సరికాదన్నారు. ములుగును జిల్లా చేసి మెడికల్ కళాశాల, వంద పడకల దవాఖాన ఏర్పాటు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని పేర్కొన్నారు. వరదల సమయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం బాధితులకు అండగా నిలిచిందన్నారు. రానున్న రోజుల్లో ములుగు ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ములుగులో ఈసారి కచ్చితంగా గులాబీ జెండా ఎగురవేస్తామని శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. సమావేశంలో ఎంపీలు పసునూరి దయకర్, మాలోత్ కవిత పాల్గొన్నారు.

# చరిత్ర, సంస్కృతే ఉజ్వల భవిష్యత్‌కు పునాది

**నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి**


నిట్‌లో మొక్కలు నాటుడుతున్న డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 19 : చరిత్ర, సంస్కృతి, వీరుల త్యాగాలే భారతదేశ ఉజ్వల భవిష్యత్‌కు పునాది అని వరంగల్ నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి అన్నారు. విద్యా మంత్రిత్వ శాఖ 'మేరీ మిట్టీ మేరీ దేశ్' ప్రచారంలో భాగంగా నిట్ నేషనల్ సర్వీస్ స్కీమ్(ఎన్ఎస్ఎస్), ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ (ఈబీఎస్‌బీ) ఈవెంట్‌లను నిర్వహించారు. రూరల్ డెవలప్‌మెంట్ సెంటర్ సమీపంలో 75 మొక్కలు నాటారు. డైరెక్టర్ సుబుధి, విద్యార్థి సంక్షేమ డీన్ ప్రొఫెసర్ శ్రీనివాసాచార్య, ఎన్ఎస్ఎస్ ఫ్యాకల్టీ అడ్వైజర్ ప్రొఫెసర్ ప్రకాశ్ కొడాలి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ప్లాంటేషన్ డ్రైవ్ నిర్వహించిన ఈ ప్రాంతానికి 'అమృత్ వాటిక' అని పేరు పెట్టారు. క్యాంపస్‌లోని వివిధ ప్రదేశాల్లో ప్లాంటేషన్ డ్రైవ్ నిర్వహించారు. అనంతరం కుండల్లో మట్టి, బియ్యాన్ని సేకరించి డైరెక్టర్ డీన్‌లు, అధ్యాపకులు, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. సేకరించిన బియ్యం, మట్టిని ఢిల్లీకి పంపిస్తామన్నారు.

## ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య


శంషుద్దీన్ (ఫైల్)

దంతాలపల్లి, అక్టోబర్ 19 : ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో జరిగింది. ఎస్సై రమేశ్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. దాట్ల గ్రామానికి చెందిన ఎస్‌కే శంషుద్దీన్ (21) హనుమకొండలోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ చదువుతూ హాస్టల్‌లో ఉంటున్నాడు. దసరా సెలవలు కావడంతో ఇంటికి వచ్చాడు. హాస్టల్‌లో ఉండడం ఇష్టం లేదు అని ఇంట్లో చెప్పేందుకు భయపడి చీరతో ఉరేసుకొన్నాడు. తండ్రి మహ్మద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## ఎమ్మెల్యే రాజయ్య వాహనం తనిఖీ

వేలేరు, అక్టోబర్ 19 : రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే రాజయ్య వాహనాన్ని వేలేరు ఎస్సై డీ హరిత గురువారం తనిఖీ చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో వేలేరు, పీచర క్రాస్‌రోడ్డు వద్ద ఎమ్మెల్యే ఆపి లోపల, డిక్కీలో పూర్తిగా తనిఖీ చేసి వదిలిపెట్టారు.


ఎమ్మెల్యే రాజయ్య వాహనాన్ని తనిఖీ చేస్తున్న వేలేరు ఎస్సై డీ హరిత

## వినియోగదారులతో మర్యాదగా నడుచుకోవాలి

**ఎన్పీడీసీఎల్ సీఎండీ అన్నమనేని గోపాల్‌రావు**

హనుమకొండ సబర్బన్, అక్టోబర్ 19 : విద్యుత్ వినియోగదారులతో ఎల్లప్పుడూ సత్సంబంధాలు కొనసాగించాలని, అప్పుడే మెరుగైన సేవలు అందించడం సాధ్యమవుతుందని ఎన్పీడీసీఎల్ సీఎండీ అన్నమనేని గోపాల్‌రావు అన్నారు. గురువారం నక్కలగుట్టలోని విద్యుత్ భవన్‌లో వరంగల్, మహబూబాబాద్ జిల్లాల ఎస్ఈలు, డీఈలు, ఎస్ఏవోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లోపభూయిష్టమైన కెపాసిటర్ బ్యాంక్‌లను బాగుచేసి వినియోగంలోకి తీసుకురావాలని అన్నారు. నష్టాలను తగ్గించుకోవాలని, ట్రాన్స్‌ఫార్మర్లు ఫెయిల్ కాకుండా చూసుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడు విద్యుత్ లైన్ల పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. విద్యుత్ బిల్లులను ఆన్‌లైన్ ద్వారా చెల్లించడం వల్ల కలిగే లాభాలను వినియోగదారులకు వివరించాలని కోరారు. కార్యక్రమంలో డైరెక్టర్లు వెంకటేశ్వరరావు, గణపతి, సంధ్యారాణి, మోహన్‌రెడ్డి, తిరుపతి రెడ్డి, సీజీఎంలు సదర్‌లాల్, అశోక్‌కుమార్, మోహన్‌రావు, కిషన్, బీకంసింగ్, అశోక్, వరంగల్ ఎస్ఈ మధుసూదన్, మహబూబాబాద్ ఎస్ఈ నరేశ్, డీఈ ఐటీ అనిల్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ అన్నమనేని గోపాల్‌రావు